తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

# జనంసాక్షి

www.janamsakshi.org

ఖమ్మం - నల్లగొండ

భద్రాద్రి కొత్తగూడెం | సూర్యాపేట | యాద్రాద్రి భువనగిరి

సోమవారం 01 జూన్ 2026 | పేజీలు : 8

Follow :

## 40 డిగ్రీల ఎండలో చంటి బిడ్డతో తల్లి బతుకు పోరాటం



**వలిగొండ,మే 31 (జనంసాక్షి)** రెక్కాడితే గాని డొక్కాడని నిరుపేద కుటుంబాలు ఇవి. రోజు ఏదో కూలీ చేస్తేనే ఆ కుటుంబానికి గంజి మెతుకులు. ఎండైనా, వానైనా ఇంకా ఏదైనా పనికి వెళ్లాల్సిందే.

నిత్యం ఇళ్లల్లో ఉండే మనమే ఏసీలు, కూలర్లకు, ఫ్యాన్లకు అక్కపోతు ఎండలు తట్టుకోలేక పోతున్నాము. అలాంటిది ఒక తల్లి తన ఒళ్ళో చంటి బిడ్డను వేసుకొని రోడ్డుపై మామిడి పండ్లు వ్యాపారం చేస్తూ కూటి కోసం కష్టపడుతూ తన కుటుంబానికి ఆసరాగా నిలుస్తుంది. నిజంగా ఆ మాతృమూర్తికి వందనం. ఏది ఏమైనా తల్లి ప్రేమను మించి ఈ ప్రపంచంలో ఏది గొప్పది కాదు. ప్రతి కొడుకు, కూతురు ఎదుగుదల కోసం తల్లిదండ్రుల పడే కష్టం వెలకట్టలేనిది.

## రెడ్ బ్యాడ్జీలు ధరించి విధుల్లో పాల్గొన్న ఆర్టీసీ ఉద్యోగులు



**తుంగతుర్తి మే 31 (జనంసాక్షి) :** రెడ్ బ్యాడ్జీలు ధరించి తమ ఆర్టీసీ సంస్థను ప్రభుత్వంలో విలీనం చేయాలని డిమాండ్ తో ఆదివారం ఆ సంస్థ ఆర్టీసీ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు ఆర్టీసీ ఉద్యోగులు విధుల్లో పాల్గొన్నారు, ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో టిఆర్ఎస్ ప్రభుత్వం ఆర్టీసీ సంస్థను విలీనం చేస్తామని చెప్పి ఆచరణలో విఫలమయ్యారని అన్నారు, కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్ర అవతరణ దినోత్సవ సందర్భంగా ఆర్టీసీ సంస్థను ప్రభుత్వంలో విలీనం చేస్తామని చెప్పి ఇప్పుడు గుర్తింపు ఎన్నికలు నిర్వహించిన తర్వాతనే ఆర్టీసీ సంస్థను విలీనం చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం చెప్పడం తో సంస్థలో పనిచేసే ఉద్యోగులు విచారం వ్యక్తం చేస్తున్నారని అన్నారు, సోమవారం హైదరాబాదులోని ధర్నా చౌక్ లో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నట్టు తెలిపారు ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి గతంలో ఇచ్చిన మాటను శిరసా వహిస్తూ వెంటనే ఆర్టీసీ సంస్థను ప్రభుత్వంలో విలీనం చేయాలని కోరుతున్నారు.



## చిన్నారులను ఆశీర్వదించిన మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి

**కనగల్లు, మే 31, (జనంసాక్షి)** మండలం లోని అమ్మగూడెం గ్రామ సర్పంచ్ కొండ రవలి అంజయ్య దంపతుల కుమార్తె , కుమారుని నూతన పట్టు వస్త్ర అలంకరణ మహోత్సవం ధర్వేశిపురం బుక్క అంజయ్య ఫంక్షన్ హాల్ లో ఆదివారం జరిగింది. సర్పంచ్ ఆహ్వానం మేరకు మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి నాయకులతో హాజరై చిన్నారులను ఆశీర్వదించారు. మంత్రి వెంట ఆర్టిఏ సభ్యులు కే రాజిరెడ్డి, ఎక్స్ జెడ్పిటిసి నర్సింగ్ శ్రీనివాస్ గౌడ్, సర్పంచుల ఫోరం అధ్యక్షులు ఓర్సు పెంటయ్య, జిల్లా కిసాన్ సెల్ కన్వీనర్ గోలి జగాల్ రెడ్డి, సర్పంచులు నాగవల్లి నాగమణి, బైరు నాగమణి నాగయ్య, రాయల శేఖర్, పోచమల్ల సురేష్, పంపు నాగమణి జానయ్య, ఎల్లమ్మ గుడి మాజీ చైర్మన్ చీదేటి వెంకటరెడ్డి, మాజీ సర్పంచులు గోలి నర్సిరెడ్డి, బిక్షం యాదవ్, నెలగంధ రాసి ముత్తయ్య, నాయకులు గార్లపాటి శ్రీనివాస్ రెడ్డి, చనగోని యాదగిరి, పగిడిపాటి, సత్తయ్య గోగు రవి,మండల్ పరమేష్, తదితరులు ఉన్నారు.

# అంబేద్కరా...అసంపూర్తిలోనేనా మీ భవనం..?

- అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగామారిన భవనం
- ఏండ్లు గడుస్తున్నా పనులు పూర్తికాని వైనం
- ప్రతినిధుల పర్యవేక్షణ లోపమా... అధికారుల నిర్లక్ష్య వైఖరా
- అంబేద్కర్ వారసుల కల నిజమయ్యేనా
- ఎమ్మెల్యే చొరవ చూపాలని మండల ప్రజల విజ్ఞప్తి





**మునుగోడు, మే 31 (జనంసాక్షి)** భారత రాజ్యాంగ నిర్మాత , పేద ప్రజల అభ్యున్నతికి పాటుపడిన మహోన్నత వ్యక్తి, సంఘసంస్కర్త అయిన డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురించి గొప్పగా మాట్లాడే ప్రజా ప్రతినిధులు అసంపూర్తిగా ఉన్న అంబేద్కర్ భవన నిర్మాణంపై నిర్లక్ష్యం వహిస్తూ అంబేద్కర్ వారసుల కలను నీరు కారుస్తున్నారు.వివరాల్లోకెళ్తే నల్లగొండ జిల్లా మునుగోడు మండల కేంద్రంలో 2018 సంవత్సరంలో కోటి రూపాయల నిధులతో మంజూరైన అంబేద్కర్ భవనం ఇప్పటికీ 75 శాతం పనులు మాత్రమే జరిగింది. మిగతా 25 శాతం పనులను పెండింగ్లో ఉంచారు. అంబేద్కర్ భవనం అమలు కోసం మండలం మొత్తం కళ్ళు కాయలు కాసేలా ప్రజలు ఎదురుచూస్తున్న అందరికీ అందని ద్రాక్షల మారింది. అంబేద్కర్ భవనం ప్రారంభమైతే బీసీ ఎస్టీ ఎస్సీ నిరుపేదలకు అండగా ఉండి శుభకార్యాలకు వివిధ కార్యక్రమాలకు ఉపయోగపడుతుందని అంబేద్కర్ వారసులు కలలు కన్నారు. నేటికీ ఆ కలలు తీరకపోవడంతో ప్రభుత్వంపై మండి పడుతున్నారు. మునుగోడు మండల ప్రజలపై కపట ప్రేమ చూపిస్తున్నారనేది నిదర్శనం అవుతుందని దళిత కుల సంఘాలు విమర్శిస్తున్నాయి. 2018 సంవత్సరంలో మునుగోడు నియోజకవర్గ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా శంకుస్థాపన నిర్వహించారు. ఆ తర్వాత మునుగోడు ఎమ్మెల్యేగా కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ఎన్నికైన అనంతరం భవనానికి మోక్షం వస్తుందని అందుబాటులోకి వస్తుందని ఆశించిన అంబేద్కర్ వాదులకు నిరాశే మిగిలింది. అంబేద్కర్ భవన నిర్మాణం పర్యవేక్షణలో విఫలమయ్యారు. ప్రస్తుతం మునుగోడు అసంపూర్తిగా ఉన్న అంబేద్కర్ భవనం నిధుల మంజూరు పై అధికార పార్టీ ఎమ్మెల్యే మంత్రులు శ్రద్ధ చూపడం లేదని పలువురు అంబేద్కరిస్టులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే అసంపూర్తిలో ఉన్న పనులను ప్రారంభించేలా నిధులు మంజూరు చేయాలని మండల ప్రజలు కోరుకుంటున్నారు.



ఆర్టీఐ చట్టాన్ని పట్టించుకోని ఎంఈఓ కార్యాలయ అధికారులు

- ఎందుకు ఏర్పాటు చేయడం లేదు బోర్డులు..?
- ప్రశ్నిస్తున్న ప్రజలు..

జనంసాక్షి

## జనంసాక్షి ఎఫెక్ట్

## అధికారుల స్పందన.. ఆర్టీఐ బోర్డుల ఏర్పాటు

**భూదాన్ పోచంపల్లి, మే 31 (జనంసాక్షి):** మండల విద్యాశాఖ కార్యాలయంలో ఆర్టీఐ బోర్డులు, సూచిక బోర్డులు లేకపోవడంపై మే 25న జనం సాక్షి లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. కార్యాలయంలో తప్పనిసరిగా ఉండాల్సిన ఆర్టీఐ వివరాల బోర్డులు, సూచిక బోర్డులను ఏర్పాటు చేశారు. ఇంతకుముందు కార్యాలయానికి వచ్చే ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, ప్రజలు సరైన సమాచారం లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. కార్యాలయంలో ఏ విభాగం ఎక్కడ ఉంది, ఏ అధికారిని సంప్రదించాలి వంటి కనీస సమాచారం లేక ప్రజలు అయోమయానికి గురవుతున్నారని విమర్శలు వచ్చాయి. ఈ నేపథ్యంలో జనం సాక్షి లో వచ్చిన కథనంతో అధికారులు స్పందించి బోర్డులు ఏర్పాటు చేయడం పట్ల ప్రజలు సంతృప్తి వ్యక్తం చేస్తున్నప్పటికీ, ఇలాంటి ప్రాథమిక సదుపాయాలు ముందుగానే ఎందుకు ఏర్పాటు చేయలేదు? అని ప్రశ్నిస్తున్నారు. ప్రజలకు సేవలు అందించే ప్రభుత్వ కార్యాలయాల్లో పారదర్శకత, సమాచార హక్కు అమలు కావాలంటే ఇలాంటి బోర్డులు నిరంతరం అందుబాటులో ఉండాలని స్థానికులు కోరుతున్నారు. ఎంఈఓ కార్యాలయంలో ఆర్టిఐ బోర్డులు ఏర్పాటు చేసినందుకు జనం సాక్షి పత్రికను పలువురు అభినందించారు.



## ఆత్మీయ సమ్మేళనం



**వలిగొండ, మే 31 (జనంసాక్షి)**

మండలంలోని దుప్పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1996-97 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం ఆదివారం నిర్వహించారు. ఆనాటి మధుర జ్ఞాపకాలను ఒకరికొకరు గుర్తు చేసుకున్నారు. ఉపాధ్యాయులను శాలువలతో సన్మానించి జ్ఞాపకాలు అందజేశారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

## పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

**నూతనకల్ మే31(జనంసాక్షి)**



పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఎస్ఎస్సి 1999-2000 బ్యాచ్ విద్యార్థులు 10వ తరగతి పూర్తయి 25 సంవత్సరాలు అయినది కాబట్టి అందరూ కష్టసుఖాలు పంచుకోవడానికి ఆత్మీయ సమావేశం ఐఎల్ఆర్ ఫంక్షన్ హాల్ నూతనకల్ లో ఆదివారం జరుపుకోవడం జరిగింది ఉపాధ్యాయ గురువులు పాల్గొని అందరి స్థితిగతులను అడిగి తెలుసుకొని ఉన్నత స్థాయిలో ఉండాలని కోరుకుంటున్నామని ఉపాధ్యాయులు లింగయ్య పిటి మల్లయ్య పాల్గొని పూర్వ విద్యార్థులను అభినందించారు ఈ బ్యాచ్ కి సంబంధించిన కలెక్టర్ గా ఆంధ్ర కేడర్ కు విధులు నిర్వర్తిస్తున్న చామకూరి శ్రీధర్ ఐఏఎస్ కూడా ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్నారు ఈ కమిటీ పూర్వ విద్యార్థులు ఒక కమిటీగా ఏర్పడి ప్రోగ్రాం కి అందరూ సహకరించినారు ఈ వారు కార్యక్రమంలో భీమిడి సుభాష్ పొన్నం మురళి, మేడిపల్లి అశోక్, ముత్యం ఉపేందర్,ఇమ్మిరెడ్డి దయాకర్ రెడ్డి మహేశ్వరం మాణిక్యం, పెంటయ్య, వీరేశం, ముత్తయ్య, భయ్యా లింగేశ్వర్ యాదవ్ మరి కొంత మంది మిత్రులు పాల్గొనడం జరిగింది.

## సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

**మాడ్గులపల్లి, మే 31( జనంసాక్షి):**



మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఆదివారం లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి (అఛీఈ) చెక్కులను పంపిణీ చేశారు రాష్ట్ర రోడ్లు భవనాల, సినిమాటోగ్రఫీ శాఖామాత్యులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి ప్రత్యేక సహకారంతో మాడ్గులపల్లి, దాచారం గ్రామాలకు చెందిన ఆరుగురు లబ్ధిదారులకు మొత్తం రూ. 2,36,000 విలువైన ఆర్థిక సహాయపు చెక్కులను స్థానిక ప్రజాప్రతి నిధులు అందజేశారు.గ్రామ పంచాయతీలో జరిగిన ఈ కార్యక్రమంలో మాడ్గులపల్లి గ్రామానికి చెందిన కట్ట జానకమ్మకు రూ. 60,000, కొమ్మురాజుల రాజుకు రూ. 46,000, కొమ్మురాజుల కమలకు రూ. 37,500 చెక్కులను అందజేశారు అలాగే దాచారం గ్రామానికి చెందిన కొత్త శ్రావణికి రూ. 45,000, యర్రమద సైదిరెడ్డికి రూ. 26,000, ఎలిజాల వెంకమ్మకు రూ. 22,000 చొప్పున ఆర్థిక సహాయాన్ని పంపిణీ చేశారు ఆపద సమయంలో తమకు ఆర్థిక సహాయం అందేలా చొరవ చూపిన నియోజకవర్గ ప్రజాప్రతినిధి, మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి కి, అలాగే ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి కి లబ్ధిదారులు స్థానిక నాయకులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు ఈ కార్యక్రమంలో మాడ్గులపల్లి సర్పంచ్ అర్రూరి నరేష్, దాచారం సర్పంచ్ జానయ్య, మాడ్గులపల్లి గ్రామ కాంగ్రెస్ శాఖ అధ్యక్షుడు ఎరుకల వెంకన్న గౌడ్, స్థానిక నాయకులు సిద్ధార్థ రెడ్డి, సతీష్, తదితరులు పాల్గొన్నారు.



## జిల్లా కేంద్రంలో ప్రెస్ క్లబ్ భవనాన్ని ఏర్పాటు చేయాలి

**తెలంగాణా జర్నలిస్ట్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు షానూర్**

**యాదాద్రి, కరస్పాండెంట్ మే 31 (జనం సాక్షి)**

యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలో ప్రెస్ క్లబ్ భవనాన్ని ఏర్పాటు చేయాలని తెలంగాణ జర్నలిస్టు అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు మొహమ్మద్ షానూర్ బాబా అన్నారు ఆదివారం టీ జె ఏ జిల్లా కార్యాలయంలో మాట్లాడుతూ యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రం లో పనిచేస్తున్న ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టుల కోసం ప్రభుత్వం స్థలాన్ని కేటాయించి ప్రెస్ క్లబ్ భవనాన్ని నిర్మించి ఇవ్వాలని కోరారు. ఇప్పటివరకు జిల్లా లో ప్రెస్ క్లబ్ భవనం లేకపోవడం చాలా బాధాకరమని అన్నారు. జిల్లా కేంద్రం మరియు వివిధ మండల జర్నలిస్టుల సమస్యలను వివరించడానికి ఒక వేదిక లేకపోవడం వల్ల జర్నలిస్టులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఈ సమస్యను స్థానిక ఎమ్మెల్యే, అధికారులు దృష్టి సారించి సమస్యను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి గోపరాజు వెంకన్న జిల్లా ఉపాధ్యక్షుడు ఖదీర్, రెహమాన్, జిల్లా ప్రచార కార్యదర్శి సిరిల్, అల్తాఫ్ తదితరులు పాల్గొన్నారు.

## మహిళ దృశ్యం



**జనంసాక్షి, మిర్యాలగూడ :**

మహిళ అదృశ్యం అయిన సంఘటన మిర్యాలగూడ మండలం లో చోటుచేసుకుంది. మిర్యాలగూడ రూరల్ ఎస్సై లక్ష్మయ్య తెలిపిన వివరాల ప్రకారం మండల పరిధిలోని తడకమల్ల గ్రామానికి చెందిన రాపోలు స్వర్ణ ఈ నెల 24 వ తేదీన గ్రామంలోని కిరాణా షాప్ వద్దకి వెళ్లి వస్తానని చెప్పి వెళ్లి తిరిగి ఇంటికి రాకుండా ఎటో వెళ్లి పోయినది..ఆ రోజు నుండి ఆమె కనిపించక పోవడం తో ఆమె భర్త రాపోలు రాజు ఇచ్చిన పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి ఆచూకి కోసం వెతకడం జరుగుతుంది అన్నారు. 29 సంవత్సరాల వయస్సు కలిగి 5 అడుగుల ఎత్తు ఉండి పంజాబీ డ్రెస్ ధరించి ఉన్న ఇట్టి మహిళ ఆచూకీ తెలిసిన చో రూరల్ పోలీసుస్టేషన్ కి తెలియ పరిచగలరని అన్నారు.

## అస్తమించిన కళా సూర్యుడు

### గడ్డం సుదర్శన్ చిందు

**మునుగోడు మిర్యాలగూడ :**



మునుగోడు గడ్డమీద ముద్దు బిడ్డగా వెలసినకళలకళాకారుడుమన గడ్డం సుదర్శన్ చిందు కళను శ్వాసగా చేసుకొని,చిందు అడుగులతో చరిత్రలో నిలిచినవాడు జానపద గీతాల్లో జనజీవనాన్ని పలికించిన వాడు.నేడు మౌనమై పోయినా అతని కళ మాత్రం తరతరాలకు మార్మో గుతూనే ఉంటుంది. రంగస్థలం ఒక కళాకారుడిని కోల్పోయింది. గ్రామం ఒక గొంతును కోల్పోయింది.కానీ అతడువెలిగించిన కళాదీపంఎప్పటికీ ఆరిపోదు. చిందు అడుగు ఆగిపోయింది. ఆ అడుగుల ప్రతిధ్వనిఇంకా వినిపిస్తూనే ఉంది. గజ్జ కట్టి ఆడిన రంగస్థలం అతడి కోసం విలపిస్తుంది నన్నెప్పుడూతపిస్తావని. కళాకారుడు దూరమైనా,కళలో ఆయనచిరంజీవిగా నిలిచిపోతాడు ప్రజలహృదయాలను గెలిచాడు మనిషి దూరమైనాజ్ఞాపకాలు దూరం కావు మంచి మనుషులు కనుమరుగైనా, వారి ముద్ర మనసుల్లో శాశ్వతంగా నిలిచిపోతుంది.

## జీవో నెంబర్-7ను బేషరతుగా రద్దు చేయాలి: మేకపోతుల నరేందర్ గౌడ్

**నల్లగొండ ప్రతినిధి,మే 31,(జనంసాక్షి):**



జీవో నెంబర్-7ను ప్రభుత్వం వెంటనే బేషరతుగా రద్దు చేయాలని, బీసీ విద్యార్థులకు అన్యాయం జరిగితే సహించబోమని తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు మేకపోతుల నరేందర్ గౌడ్ హెచ్చరించారు.నల్గొండ జిల్లా కేంద్రంలోని యాదవ సంఘం భవనంలో తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు చిలకరాజు సతీష్ కుమార్ అధ్యక్షతన ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు.ఈ సందర్భంగా నరేందర్ గౌడ్ మాట్లాడుతూ బీసీల సంక్షేమం విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ద్వంద్వ వైఖరి అవలంబిస్తున్నాయని విమర్శించారు. రాష్ట్ర జనాభాలో అత్యధిక శాతం ఉన్న బీసీలకు రాజకీయ, విద్యా, ఆర్థిక రంగాల్లో తగిన ప్రాధాన్యత కల్పించడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయని ఆరోపించారు. బీసీల అభ్యున్నతికి ప్రత్యేక కార్యాచరణ రూపొందించి, వారి హక్కులను పరిరక్షించే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను ప్రభుత్వం సకాలంలో విడుదల చేయకపోవడంతో పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఫీజులు చెల్లించలేక అనేక మంది విద్యార్థులు ఉన్నత విద్యకు దూరమవుతున్నారని పేర్కొన్నారు.అర్హులైన ప్రతి విద్యార్థికి ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు పూర్తిస్థాయిలో అందేలా ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. బీసీల అభివృద్ధి కోసం ప్రత్యేక నిధులు కేటాయించి సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు.ప్రభుత్వం జీవో నెంబర్-7ను రద్దు చేసి బీసీల సమస్యలను పరిష్కరించే వరకు రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలను ఉధృతం చేస్తామని నరేందర్ గౌడ్ హెచ్చరించారు.ఈ సమావేశంలో రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ సరికొండ రామకృష్ణంరాజు, రాష్ట్ర అధికార ప్రతినిధి నీలం వెంకట మధు, రాష్ట్ర లీగల్ అడ్వైజర్ చొల్లేటి రమేష్, రాష్ట్ర ఉపాధ్యక్షులు కొత్త లింగస్వామి యాదవ్, జిల్లా ప్రధాన కార్యదర్శి కల్లూరు సత్యనారాయణ గౌడ్, జిల్లా ఉపాధ్యక్షులు వెంపటి నరసింహతో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.



# వివాహ వేడుకలో పాల్గొన్న తాటి

**అన్నపురెడ్డిపల్లి మే 31 (జనంసాక్షి)**

అన్నపురెడ్డిపల్లి మండలం బూర్గుగూడెం గ్రామంలో మొహ్మద్ అలీ సోదరి రహీసా బేగం నసీర్ పాషా వివాహ వేడుకలో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించి నూతన వస్త్రాలను అందజేసి శుభాకాంక్షలు తెలిపిన బూర్గంపహాడ్, అశ్వారావుపేట మాజీ ఎమ్మెల్యే, తెలంగాణ రాష్ట్ర మాజీ తొలి ట్రైకార్ చైర్మన్ బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు తాటి వెంకటేశ్వర్లు అనంతరం నున్నా గోపాల్ రావు నివాసంలో తినేటి విందులో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మాజీ వైస్ ఎంపీపీ మామిళ్లపల్లి రామారావు , వేముల హరీష్ , మాజీ సర్పంచ్ బైటి రాజేష్, మాజీ మండల యువజన అధ్యక్షుడు వద్ది వెంకటేష్, నున్నా గోపాలరావు ,చెరుకూరి రవి , చిన్నం రామకృష్ణ , రాంబాబు , రషీద్ , సుభాని, ఆరిఫ్, సమీర్, ముజ్మిల్, అక్రమ్ , మాలిన్ , చల్లా రమేష్ పలువురు నాయకులు , కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## తెలంగాణ రాష్ట్రము కోసం ఏర్పడింది
# తెలంగాణ జర్నలిస్టు ఫోరమ్
## గుండగొని జయ శంకర్

**నల్లగొండ ప్రతినిధి,మే 31,(జనంసాక్షి):**

తెలంగాణ రాష్ట్ర సాధనలో భాగంగా ఏర్పడిన సంస్థ నే తెలంగాణ జర్నలిస్టు ఫోరం అని టి యూ డబ్ల్యూ జె 143 రాష్ట్ర నాయకులు,నల్గొండ జిల్లా అధ్యక్షులు గుండాగోని జయ శంకర్ ఆధ్వర్యంలో క్లాక్ టవర్ సెంటర్ లో జర్నలిస్టులు అందరూ కలిసి తెలంగాణ అమరవీరులకు నివాళులర్పించారు అలాగే ఫోరమ్ ఏర్పడి 25 ఏండ్లు అయింది అని వారు మాట్లాడుతూ 2001 మే 31న కేవలం పది మంది జర్నలిస్టులతో ప్రారంభమైన తెలంగాణ జర్నలిస్టు ఫోరం, తెలంగాణ రాష్ట్ర సాధన కోసం కలం యోధులుగా పోరాడుతూ 25 ఏళ్ల ప్రస్థానాన్ని విజయవంతంగా పూర్తి చేసుకుంది. ఈ సందర్భంగా రజతోత్సవాల సందర్భంగా మరిన్ని కార్యక్రమంలు చేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో టీయూడబ్ల్యూ జే జిల్లా ప్రధాన కార్యదర్శి వీరస్వా మి, జిల్లా నాయకులు ఫహిమొద్దీ న్, జనార్ధన్ రెడ్డి, దీకొండ రవిశంక ర్, పిల్లలమర్రి శ్రీనివాస్, ఎలక్ట్రాని క్ మీడియా జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు వెంకటరెడ్డి, జానయ్య, నల్లగొండ డివిజన్ యూనియన్ నాయకులు ఓడపల్లి మధు ముదిరాజ్, నీలం వెంకట మధు, దండంపల్లి రవికుమార్ గౌడ్,శివ, జానీ,వీడియో జర్నలిస్ట్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు అల్లి మల్లికార్జున్ యాదవ్, శ్రీనివాస్ గౌడ్, ఫోటో జర్నలిస్టు అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు కంది వేణు, ముచ్చర్ల విజయ్, ముచ్చర్ల శ్రీనివాస్ గౌడ్, చిన్న పత్రికల సంఘం తరపున మిసాల నరహరి, నవీన్, సైదులు తదితరులు పాల్గొన్నారు.

## కల్వకుంట్ల కవితకు భైరపాక రాసిన పుస్తకాలు అందజేత

**ఆలేరు మే 31 జనంసాక్షి**



తెలంగాణ రక్షణ సేన వ్యవస్థాప అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితను ఆలేరుకు చెందిన యువకవి, రచయిత భైరపాక స్వామి ఆదివారం హైదరాబాద్ లోని ఆమె నివాసంలో మర్యాద పూర్వకంగా కలిసి ఆమెకు తాను రాసిన గ్రాంథాలను అందజేశారు. భైరపాక రాసిన తెలుగు పతాక కవితా సంపుటి, తెలంగాణ పల్లెపాట కవితా సంపుటి, ఆకలి మంటలు కవితా సంపుటి పుస్తకాలను పరిశీలించిన కల్వకుంట్ల కవిత చిన్న వయస్సులోనే భైరపాక పెద్ద పెద్ద సాహిత్యపరులతో పోటీపడుతున్నారనీ అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని మంచి సాహిత్య గ్రంథాలు భైరపాక కలంలోంచి వెలువరించాలనీ సూచించారు. తమ సహకారం భవిష్యత్తులో ఎప్పటికీ ఉంటుందనీ తెలిపారు.

# భద్రాచలంలో ఒయాసిస్ ఫెర్టిలిటీ సౌకర్యం : డాక్టర్ అలీన శాంతి

**భద్రాచలం మే 31 (జనంసాక్షి)**

భద్రాచలం పట్టణంలో రాధాకృష్ణ హాస్పిటల్ లో ఒయాసిస్ ఫెర్టిలిటీ సౌకర్యాన్ని నూతనం గా అందుబాటులోకి తీసుకొచ్చిందని రాధా హాస్పిటల్స్ ప్రముఖ వైద్య నిపుణురాలు డాక్టర్ అలీనా శాంతి తెలిపారు. దేశవ్యాప్తం గా ఎంతోమంది దంపతుల జీవితాల్లో ఆనందాన్ని నింపుతున్న ఒయాసిస్ ఫెర్టిలిటీ, ఇప్పుడు రాధా హాస్పిటల్స్‌లో ప్రజలకు అందుబాటులోకి వచ్చిందని, ఇప్పటి వరకు మంచి చికిత్స కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సి వచ్చిన దంపతులకు, ఇకపై భద్రా చలంలోనే నాణ్యమైన సేవలు అందుబాటు లో ఉండనున్నాయని డాక్టర్ అలీనా శాంతి తెలిపారు. భద్రాచల పరిసర ప్రాంతాల ప్రజలకు పిల్లలు కలగడానికి అవసరమైన ప్రత్యేక వైద్య సేవలు, అనుభవజ్ఞులైన వైద్యుల పర్యవేక్షణలో ఇప్పుడు భద్రాచలంలో లభించనున్నాయి. తల్లిదండ్రులు కావాలనుకునే కలను నిజం చేసేందుకు, ప్రేమతో కూడిన సేవలు, వ్యక్తిగత శ్రద్ధ, ఆధునిక వైద్య సదుపాయాలతో ఒయాసిస్ ఫెర్టిలిటీ మరియు రాధా హాస్పిటల్స్ మీకు తోడుగా నిలుస్తున్నాయని తెలియజేశారు. ఒయాసిస్ జనని బస్సు యాత్ర జూన్ 1వ తేదీ ఉదయం 9 గంటల నుండి సాయంత్రం వరకు రాధ హాస్పిటల్ నందు ఉంటుందని, దీనిని స్థానిక శాసనసభ్యులు డాక్టర్ తెల్లం వెంకట్రావు ప్రారంభిస్తారని, అందరూ ఈ అవకాశం వినియోగించుకోవాలని డాక్టర్




అలీనా శాంతి కోరారు.

# విద్యుత్ ఘాతంతో కోడె మృతి
## ఆదుకోవాలని రైతు ఆవేదన

**గుర్రంపోడు: మే 31 (జనంసాక్షి)**



గుర్రంపోడు మండలంలోని పాల్వాయి గ్రామ పంచాయతీ పరిధిలో విద్యుత్ తీగ తగిలి ఒక కోడె మృతి చెందిన సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. బాధితుడు మరియు స్థానిక రైతు తెలిపిన వివరాల ప్రకారం... గట్టుపల్లి ముత్యపురెడ్డి కి చెందిన కోడెను రోజు మాదిరిగానే మేత కోసం పశువులతో పాటు వదిలారు. అయితే ఇటీవల కురిసిన గాలి వానల కారణంగా కరెంటు వైర్ తెగి భూమి మీద పడింది.మేత మేస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు ఆ విద్యుత్ తీగ కోడె నోటికి తగలడంతో భారీ విద్యుత్ షాక్‌కు గురైంది. కరెంట్ తగిలిన వెంటనే కోడె అక్కడికక్కడే ప్రాణాలు విడిచినట్లు రైతు ముత్యపురెడ్డి కన్నీరుమున్నీరయ్యారు. చనిపోయిన కోడె విలువ సుమారు రూ. 50 వేల వరకు ఉంటుందని, తద్వారా తమకు భారీ ఆర్థిక నష్టం వాటిల్లిందని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రమాదవశాత్తు జరిగిన ఈ నష్టానికి ప్రభుత్వం స్పందించి, తగిన పరిహారం అందించి తమ్మును ఆదుకోవాలని నష్టపోయిన రైతు కుటుంబం వేడుకుంటోంది.

## నేడు విద్యుత్ సరఫరాలో
# అంతరాయం
## విద్యుత్ ఏఈ కుమార్ వెల్లడి

**కనగల్లు మే 31 (జనంసాక్షి)**

నేడు కనగల్లు మండల పరిధిలోని 33/11కెవి పరిధిలోని విద్యుత్ సరఫరా లో అంతరాయం ఏర్పడుతుందని మండల విద్యుత్ ఏ. ఈ. ఆర్. జె. ఎన్ కుమార్ తెలిపారు. ఈదురు గాలులకు విద్యుత్ ప్రధాన లైన్ల వెంట ఉన్న చెట్లు విరిగి కరెంటు తీగల మీద పడి సరఫరా లో అంతరాయం కలుగుతున్నందున ఇట్టి పనులను మెరుగుపరుచుటకుగాను నేడు ఉదయం 7 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు వ్యవసాయ, గృహ, వాణిజ్య అవసరాలకు వినియోగించే కరెంటు సరఫరాను నిలిపివేయబడుతుందని ఏఈ తెలియజేశారు ఈ అంతరాయాన్ని మండల ప్రజలు గమనించి క్షేత్రస్థాయి విద్యుత్ అధికారులకు సహకరించాలని కోరారు.



# పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

**హాలియా మే 31 జనంసాక్షి**

హాలియామున్సిపాలిటీలోని పూర్వ నాగార్జున ఉన్నత పాఠశాలలో చదివిన 2000?2001 పూర్వవిద్యార్థులు 25 సంవత్సరాల తర్వాత ఆత్మీయ సమ్మేళనాన్ని హైదరాబాదులోఘనంగా నిర్వహించారు. ఈ సమావేశం సమ్మేళనంలో పాఠశాల కాలంలో వారిని ప్రశ????ణనిచ్చిన గురువులతో విద్యార్థులు హృదయపూర్వకంగా కలిశారు. ఒకరినొకరు హాయిగా పలకరించుకుంటూ పాత రోజులు, పాఠశాల జీవిత జ్ఞాపకాలను స్మరిస్తూ ఆనందమై విడిభాగమయ్యారు. పాత అనుభూతులను గుర్తుచేసుకున్నందుకు అందరూ ఎంతో సంతోషపడ్డారు మరియు ఇలా ప్రతి సంవత్సరం సమావేశాలు నిర్వహించాలని సంకల్పించారు.ఉపాధ్యాయులు మాట్లాడుతూ “మేము పెంచిన ఆ చిన్న ముక్కలు ఎంతో పెద్ద ఎత్తున ఎదిగిపోయారని చూడటం ఆనందానికి పరిమితి లేదు. మా విద్యార్థులు వివిధ రంగాలలో విజయవంతంగా ఉన్నారని ఎంతో గర్వంగా ఉంది,” అని అభివక్తి వ్యక్తం చేశారు.సమ్మేళనంలో పాల్గొన్న గౌరవాబురు: కోటిరెడ్డి, లింగారెడ్డి, రాజిరెడ్డి, పాపిరెడ్డి, రంజాన్ అలీ, లింగారెడ్డి పాపిరెడ్డి.పాత విద్యార్థులు పాల్గొన్న వారిలో: గార్లపాటి మనోజ్, లక్కుమారపు నరేందర్, రాజీవ్ మిట్టపల్లి, వేణు బచ్చు, చేగొండి అర్జున్, నాగరాజు బూరుగు, సంధ్య, ఉమేష్ రెడ్డి, రామ్ రెడ్డి తదితరులు ఉన్నారు.

## పూర్వ విద్యార్థుల
# ఆత్మీయ సమ్మేళనం

**ఆలేరు మే 31 జనంసాక్షి**

యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు పట్టణ కేంద్రంలో శ్రీ రామకృష్ణ విద్యాలయంలో 2005 2006 సంవత్సరంలో పదవ తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం పట్టణంలో దినేష్ గార్డెన్లో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆనాటి తీపి జ్ఞాపకాలు గుర్తు చేసుకున్నారు. పాఠశాలలో జరిగిన సంఘటనలు ఉపాధ్యాయులతో చర్చించి మాట్లాడారు. పాఠశాలలో ఆడిన ఆటలను పాటలను ఒకరికొకరు పంచుకొని చేసిన సంఘటనలు ఉపాధ్యాయతో మాట్లాడారు. అనంతరం ఉపాధ్యాయులు చెప్పిన బోధన గురించి వివరించారు. ఉపాధ్యాయులతో సంక్షిప్త భోజనం చేశారు. విద్యార్థులు ఉపాధ్యాయులను శాలువతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆనాటి ఉపాధ్యాయులు , విద్యార్థిని విద్యార్థిలు, తదితరులు పాల్గొన్నారు.



# అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ కుంటా శ్రీనివాస్ కి ఆత్మీయ వీడ్కోలు

## భద్రాచలం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో

**భద్రాచలం మే 31 (జనంసాక్షి)**
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా :- భద్రాచలం కోర్టులో అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా గత రెండు సంవత్సరాలకు పైగా ఎంతో సమర్థవంతంగా, పారదర్శకంగా సేవలందించిన కుంటా శ్రీనివాస్ సాధారణ బదిలీలో భాగంగా జగిత్యాల కోర్టుకు వెళ్తున్న సందర్భంగా భద్రాచలం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆయనకు ఆత్మీయ వీడ్కోలు, సన్మాన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పూసాల శ్రీనివాసాచారి మాట్లాడుతూ పబ్లిక్ ప్రాసిక్యూటర్ శ్రీనివాస్ భద్రాచలంలో తన బాధ్యత కాలంలో అసాధారణమైన పనితీరును ప్రదర్శించారని, క్లిష్టమైన కేసుల్లో కూడా ఎంతో పారదర్శకతతో వ్యవహరించి న్యాయ వ్యవస్థ గౌరవాన్ని నిలబెట్టారని కొనియాడారు. ఆయన వృత్తిపరమైన బాధ్యతలను అత్యంత సమర్థవంతంగా నిర్వహించి, అందరికీ ఆదర్శంగా నిలిచారని అన్నారు. అనంతరం ఇతర సీనియర్ న్యాయవాదులు మాట్లాడుతూ శ్రీ సీతారామచంద్ర స్వామి వారి ఆశీస్సులు శ్రీనివాస్ కి ఎల్లప్పుడూ ఉండాలని, ఆయన భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులను అధిష్టించి ప్రజలకు, న్యాయ వ్యవస్థకు మరింత విశిష్టమైన సేవలు అందించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ సున్నం రమేష్, ప్రధాన కార్యదర్శి పూసాల శ్రీనివాసాచారి, జాయింట్ సెక్రటరీ తాతా లలిత, లేడీ రిప్రెసెంటేటివ్ ఎం. తరుణి, సీనియర్ న్యాయవాదులు కే. శ్రీమన్నారాయణ, గొడపర్తి నాగరాజు, సి.హెచ్.ఎన్. అంబేద్కర్, పామరాజు తిరుమలరావు, దాట్ల సంధ్య, సౌజన్య తదితర న్యాయవాదులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.





## పదవీ విరమణ పొందిన ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్

**మణుగూరు, మే 31 (జనంసాక్షి):**
37 సంవత్సరాలు విద్యారంగంలో ఉపాధ్యాయ, అధ్యాపక ఎన్ సి సి సంస్థలో వివిధ స్థాయిలలో ఉన్నత సేవలు అందించిన దొడ్డి భద్రయ్య పదవి విరమణ పొందిన సందర్భంగా వారికి పుష్పగుచ్చం శాలువాతో ఘనంగా సన్మానించారు.ఆదివారం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో వీడ్కోల్ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యా రంగానికి మీరు అందించిన సేవలు ఎనలేనివి. ఒక ప్రిన్సిపాల్‌గా కళాశాల అభివృద్ధికి, విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు మీరు చేసిన కృషి ఎప్పటికీ చిరస్మరణీయం. మీ పదవీ విరమణ జీవితం ఆనందంగా, ఆరోగ్యంగా సాగిపోవాలని హృదయపూర్వకంగా అభినందలు తెలిపారు. విద్యా సంస్థను ఉన్నత శిఖరాలకు చేర్చడంలో విద్యార్థులను మార్గదర్శకత్వం చేయడం ,అద్భుతమైన పరిపాలనా దక్షత ఎంతో మంది విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడంలో మీరు చూపిన చొరవ ప్రశంసనీయం. తోటి సిబ్బందికి మీరు ఎల్లప్పుడూ స్ఫూర్తిదాయకంగా నిలిచారు.మీరు పదవీ విరమణ పొందుతున్న ఈ శుభ సందర్భంలో, మీ భవిష్యత్తు ఆయురారోగ్యాలతో, ప్రశాంతంగా గడపాలని కోరారు. ఈ కార్యక్రమంలోకళాశాల అధ్యాపకులు విద్యార్థులు సమితి సింగారం గ్రామపంచాయతీ సర్పంచ్ కలబోయిన మాధవరావు, ఉప సర్పంచ్ గాండ్ల సురేష్,5వ వార్డు సభ్యులు కోలపిన్ని మానస, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఏ ఎం చారీ, ఎండి యాకూబ్ అలీ, బొజ్జా త్రిమూర్తులు తదితరులు పాల్గొన్నారు.

## ఒక శతాబ్దపు సుదీర్ఘ ప్రస్థానం ముగిసింది

### వందేళ్ల నిండు జీవితాన్ని పూర్తి చేసుకుని బచ్చే రాజమల్లమ్మ (100) కన్నుమూత

**మోటకొండూరు, మే 31(జనంసాక్షి):**



గ్రామంలో ఒక శతాబ్దపు కాలానికి సాక్షిగా, తరాల గమనాన్ని కళ్లారా చూసిన ఒక పెద్ద దిక్కు దూరమైంది. మోటకొండూరు మండల పరిధిలోని ముత్తి రెడ్డి గూడెం గ్రామానికి చెందిన వృద్ధురాలు బచ్చే రాజమల్లమ్మ (వయస్సు సుమారు 95 నుండి 100 సంవత్సరాలు) ఆదివారం వృద్ధాప్య సమస్యలతో కన్నుమూశారు.రాజమల్లమ్మ దాదాపు ఒక శతాబ్ద కాలం పాటు నిండు నూరేళ్ల ఆయుష్షుతో ఆదర్శవంతమైన జీవితాన్ని గడిపారు. గ్రామంలో ఎన్నో ఏళ్లుగా అందరితో ఎంతో ఆప్యాయంగా ఉంటూ, ఊరిలో జరిగే అన్ని పరిణామాలను కళ్లారా చూసిన వృద్ధురాలు కావడం చేత ఆమెను గ్రామ ప్రజలందరూ ఆప్యాయంగా 'పెద్దమ్మ' అని పిలుచుకునేవారు. తరాల మార్పును, పల్లెటూరి పరిణామాలను చూసిన ఆమె మరణం పట్ల గ్రామస్థులు తీవ్ర సెంటిమెంట్‌కు లోనవుతున్నారు. ఒక సుదీర్ఘమైన, సంపూర్ణమైన జీవితాన్ని ముగించి అనంత లోకాలకు వెళ్లిన రాజమల్లమ్మ మరణం ఆ కుటుంబానికే కాకుండా, ఇటు గ్రామ ప్రజలకు కూడా తీరని లోటని ఊరి పెద్దలు పేర్కొన్నారు. ఆమె మరణవార్త తెలియగానే గ్రామస్థులు, బంధువులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ఆమె పార్థివ దేహానికి పూలమాలలు వేసి అశ్రునయనాలతో అంతిమ నివాళులు అర్పించారు.



## పెరిక కార్పోరేషన్ చైర్మన్ కు ఘన సన్మానం

### కాంగ్రెస్ పార్టీ నాయకులు : సయ్యద్ అజ్మతుల్లా

**హుజూర్ నగర్ రూరల్, మే 31( జనంసాక్షి ):**
మండలంలోని మర్రిగూడెం గ్రామంలో ఆదివారం తెలంగాణ పెరిక కార్పొరేషన్ చైర్మన్ గా ఎన్నికైన దొంగరి వెంకటేశ్వర్లు కు శాలువా, గజ మాలలతో గ్రామ ప్రజలు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా అజ్మతుల్లా మాట్లాడుతూ సంఘం బలోపేతానికి, అభివృద్ధికి కృషి చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ షేక్ నజీమా పాషా, పాషా, తోట బిక్షం, గ్రామ ఉప సర్పంచ్ ఆదినారాయణ, గ్రామశాఖ అధ్యక్షులు షేక్ మౌలానా, సయ్యద్ ఇబ్రహీం, సయ్యద్ రబ్బాని,నిమ్మల ఆదినారాయణ, తోట కోటేశ్వరరావు, వేణుగోపాల్, షేక్ అల్లాబక్స్, మొయినుద్దీన్, మీరా సాహెబ్, సయ్యద్ మొయినుద్దీన్, వెంకట నరసయ్య, తోట శ్రీను, నాగరాజు, మల్లేష్, నాగరాజు, గల్ల శ్రీను, శ్రీను, షేక్ హాస్సాన్‌మియా, ప్రసాద్, సాయి అంజి, షేక్ రహీం, షేక్ ముస్తఫా తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

**నేరేడుచర్ల (జనంసాక్షి) :**
పదవ తరగతిలో కలసి చదువుకున్న పూర్వ విద్యార్థులంతా,27 ఏళ్ల తర్వాత ఒకే చోట చేరి సందడి చేశారు.ఆదివారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1998బి 1999 పదవ తరగతి బ్యాచ్ చెందిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఆనాటి ప్రధానోపాధ్యాలు శ్రీరాంరెడ్డి, ప్రస్తుత ప్రధానోపాధ్యాయులు బట్టు మధు, ఉపాధ్యాయులను,ఘనంగా సన్మానం చేశారు. ఈ సందర్భంగా తాము చదువుకున్న పాఠశాలలో బాల్య స్మృతులను నెమరు వేసుకున్నారు.ఈ కార్యక్రమంలో,ఆనాటి పూర్వ విద్యార్థులు వాసా కరుణాకర్,జంగిలి సోమయ్య, మచ్చ రవి,కొదమగుండ్ల నాగరాజు ,కాశీనాథు, నాగయ్య, జానయ్య,శ్రీహరి, సురేష్, వెంకటేశ్వర్లు, హరిబాబు, నాగేశ్వరరావు, అరుణ,విజయలక్ష్మి,రజిత, ధనలక్ష్మి,పద్మ, సత్యవాణి, తదితరులు పాల్గొన్నారు.



## ఆర్థిక సహాయం అందజేత

### బిఆర్ఎస్ పార్టీ నాయకులు : షేక్ అలీ

**హుజూర్‌నగర్ రూరల్, మే 31 (జనంసాక్షి):**
మండలంలోని బూరుగడ్డ మాచవరం గ్రామానికి చెందిన పార్థనబోయిన శ్రీను అనారోగ్యంతో బాధపడుతున్న అతనిని పరామర్శించి తనవంతు సహాయంగా ఆదివారం రూ 3000 వేల రూపాయల ఆర్థిక సహాయం అందించారు. ఈ సందర్భంగా షేక్ అలీ మాట్లాడుతూ ఆపదలో ఉన్నవారికి బిఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కీర్తి వీరబాబు, సురభి శివ, పార్థనబోయిన బద్రి, ఉడతల సతీష్ , చీమట వినోద్, డాక్టర్ వెంకటేశ్వర్లు, పార్థనబోయిన వెంకన్న తదితరుల పాల్గొన్నారు.



## ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం

### పొగాకు వినియోగానికి దూరంగా ఉండాలి : మోత్కూర్ సీఐ వెంకటేశ్వర్లు

**మోత్కూర్ మే 31(జనం సాక్షి)**



పొగాకు ఉత్పత్తుల వినియోగం వల్ల తీవ్రమైన అనారోగ్య సమస్యలు తలెత్తడమే కాకుండా ప్రాణాలు కోల్పోయే ప్రమాదం కూడా ఉందని మోత్కూర్ పోలీస్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు అన్నారు. ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ఆయన ప్రజలకు ప్రత్యేక సందేశం అందించారు. సిగరెట్లు, బీడీలు, గుట్కా, ఖైనీ, పాన్ మసాలా వంటి పొగాకు ఉత్పత్తుల వినియోగం ప్రస్తుతం సమాజంలో ఆందోళనకర స్థాయికి చేరుకుందని పేర్కొన్నారు. వీటి వల్ల నోటి క్యాన్సర్, గొంతు క్యాన్సర్, ఊపిరితిత్తుల క్యాన్సర్, గుండె జబ్బులు, రక్తపోటు, శ్వాసకోశ వ్యాధులు వంటి ప్రమాదకర ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయని తెలిపారు. పొగాకు సేవించే వ్యక్తులతో పాటు వారి చుట్టూ ఉండే కుటుంబ సభ్యులు కూడా పరోక్షంగా ఆరోగ్య సమస్యలకు గురవుతారని చెప్పారు. ముఖ్యంగా యువతలో పొగాకు ఉత్పత్తుల వినియోగం పెరుగుతున్న పరిస్థితి ఆందోళన కలిగిస్తోందని ఆయన అన్నారు. స్నేహితుల ప్రభావం, తప్పుడు ప్రచారాల కారణంగా యువకులు వ్యసనాలకు బానిసలవుతున్నారని పేర్కొన్నారు. ఒకసారి వ్యసనం అలవాటైతే దాని నుంచి బయటపడటం కష్టమవుతుందని, అందువల్ల ప్రారంభ దశలోనే వాటికి దూరంగా ఉండాలని సూచించారు. విద్యార్థులు తమ భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని, క్రీడలు, విద్య, సృజనాత్మక కార్యక్రమాలపై దృష్టి సారించాలని సూచించారు. ఆరోగ్యమే మహాభాగ్యమనే విషయాన్ని గుర్తుంచుకొని ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు. తల్లిదండ్రులు తమ పిల్లల రోజువారీ కార్యకలాపాలు, స్నేహితుల వర్గం, ప్రవర్తనపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని, చెడు అలవాట్లు కనిపిస్తే వెంటనే వారిని సరిదిద్దేందుకు చర్యలు తీసుకోవాలని వెంకటేశ్వర్లు సూచించారు. కుటుంబ సభ్యుల ప్రోత్సాహం, సరైన మార్గదర్శకత్వం ఉంటే యువత వ్యసనాలకు దూరంగా ఉండగలరని తెలిపారు. ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ప్రతి ఒక్కరూ పొగాకు ఉత్పత్తుల వినియోగాన్ని పూర్తిగా మానుకోవాలని, ఇప్పటికే అలవాటు ఉన్నవారు వాటిని విడిచిపెట్టేందుకు కృషి చేయాలని ఆయన కోరారు. బహిరంగ ప్రదేశాల్లో పొగాకు సేవిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పొగాకు రహిత సమాజ నిర్మాణానికి ప్రజలందరూ భాగస్వాములు కావాలని, ఆరోగ్యవంతమైన భావితరాల కోసం ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని పిలుపునిచ్చారు.

# ఎస్పీ బాలు పుట్టినరోజున రెండు తెలుగు రాష్ట్రాల పాటల పోటీలు

## పోకల శ్రీనివాస్ నిర్వహణలో..




**భద్రాచలం మే 31 (జనంసాక్షి)**
భద్రాచలం పట్టణంలో గాన గంధర్వుడు ఎస్పీ బాలసుబ్రమణ్యం 80 వ జన్మదినం సందర్భంగా పోకల శ్రీనివాస్ ఆధ్వర్యంలో పాటల పోటీలు నిర్వహించనున్నారు. జూన్ 4వ తేదీన నిర్వహించనున్న పాటల పోటీలలో రెండు తెలుగు రాష్ట్రాల గాయని గాయకులుతో ఈ పోటీలు నిర్వహించ నున్నట్లు పోకల శ్రీనివాస్ తెలియజేశారు. ఇప్పటికే గాయనీ గాయకులు తమ పేర్లను రిజిస్ట్రేషన్ చేసుకుని పాటల పోటీలకు సిద్ధమయినట్లు తెలిపారు. ముగ్గురు సంగీత విద్వాంసులు ఈ పాటల పోటీలకు న్యాయ నిర్ణేతలు గా వ్యవహరిస్తారని, గాయనీ గాయకులు ట్రాక్ మీద మాత్రమే పాటలను పాడాల్సి ఉంటుందని, ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పాటల పోటీలు జరుగుతాయని, గెలుపొందిన గాయనీ గాయకులకు అదే రోజు విజేతలకు క్యాష్ ప్రైజ్ బహుమతులు అందచేస్తారని తెలిపారు. రాత్రి 7 గంటల నుంచి హైదరాబాద్ కు చెందిన గాయనీ గాయకుల చేత బాలు మధురమైన పాటల సంగీత విభావరి కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పోకల శ్రీనివాస్ గెలుపొందిన గాయనీ గాయకులకు మహిళలకు, పురుషులకు వేర్వేరుగా ప్రైజ్ మనీ బహుమతులతో పాటు మరో మూడు కన్సోలేషన్ బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి పట్టణ ఉన్నతాధికారులు, పట్టణ ప్రముఖులు, కళాభిమానులు, సంగీతాభిమనులు బాలు అభిమానులు ఈవెంట్ కు వస్తున్నారని, పట్టణ ప్రముఖుల సహాయ సహకారాలతో నిర్వహించే కార్యక్రమానికి అందరికీ ఆహ్వానిస్తున్నట్లు నిర్వాహకులు పోకల శ్రీనివాస్ తెలియజేశారు.





## పొగ మానవ జీవితానికి “పెద్ద సెగ

**మధిర, మే 31 (జనంసాక్షి):**
మనిషి వ్యసనాల్లో దూమపానం ఒక ప్రమాదకర సమస్య అని, దీనిని నివారించక పోతే రానున్న రోజుల్లో మానవ మనుగడకు పెద్ద సమస్యగా మారవచ్చు అని పీహెచ్ సీ దెందుకూరు వైద్యులు డాక్టర్ పృథ్వీరాజ్ నాయక్, పారా మెడికల్ సిబ్బంది అన్నారు. ఆదివారం ప్రపంచపొగాకు నిషేధ దినోత్సవం సందర్భంగా శనివారం, ఆదివారం పలు చోట్ల దూమపానం, పొగాకు ఉత్పత్తుల వల్ల కలిగే అనారోగ్య సమస్యలపై దెందుకూరు, మధిర ప్రజలకు సంపూర్ణ అవగాహన కల్పించారు. పొగత్రాగటం, పొగాకు పదార్ధాలు నమలటం క్యాన్సర్ వ్యాదులకు దారి తీస్తున్నది. కావున వీటికి దూరంగా ఉండాలి అని పలు సూచనలు చేయడం జరిగింది. జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ డి రామారావు ఆదేశాల మేరకు పలు ప్రాంతాల్లో జన సమూహంలో అవకాశం ఉన్నపుడు పారా మెడికల్ సిబ్బంది ద్వారా అవగాహన చేస్తున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమములో డాక్టర్ చెరుకూరి దివ్యశృతి, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ వి వెంకటేశ్వర్లు, హెచ్ ఈఓ గోవింద్ హెల్త్ సూపర్ వైజర్ లంకా కొండయ్య వివిధ పారా మెడికల్ సిబ్బంది, ఒరిస్సా గిరిజన కూలీలు పాల్గొన్నారు.

# హెల్త్ కార్డుల కోసం జీతంలో కోత విధించడం సరికాదు

## టిపిటిఎఫ్ జిల్లా అధ్యక్షులు గుగులోత్ హరిలాల్ నాయక్



**టేకులపల్లి, మే 31(జనంసాక్షి):**
రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ,ఉపాధ్యాయుల ఆరోగ్య పథకానికి సంబంధించి అధికారికంగా హెల్త్ కార్డులు జారీ చేయకుండానే ముందస్తుగా ఆర్థికశాఖ మే నెల జీతంలో కోతలు విధించడాన్ని తీవ్రంగా ఆక్షేపిస్తున్నట్టు తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ (టిపిటిఎఫ్) జిల్లా అధ్యక్షులు గుగులోత్ హరిలాల్ నాయక్ తెలిపారు. ఇంతవరకు ఆర్థికశాఖ విధివిధానాలను ప్రకటించకుండానే,ఏ హాస్పిటల్స్ ఈ స్కీం కింద వర్తిస్తాయో తెలపకుండానే, ఎలాంటి వ్యాధులకు సంబంధించి చికిత్సలు చేస్తారో తెలపకుండానే, ముందస్తుగా ఉద్యోగుల నుంచి ఎలాంటి అనుమతులు లేకుండానే కోతలు విధించారు. దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని వారు తెలిపారు. ఆరోగ్యశాఖకు సంబంధించిన వెబ్సైట్లో ఉద్యోగుల వివరాలు కూడా పూర్తిగా నమోదు కాలేదని, మే 31 వరకు నమోదు చేయడానికి అవకాశం ప్రభుత్వం ఇచ్చిందని,ఇంతవరకు పూర్తిగా నమోదు కాకుండానే ఏ విధంగా కోత విధిస్తారని వారు ప్రశ్నించారు. భార్యాభర్తలు ఉద్యోగులైన పక్షంలో ఏ విధంగా నమోదు చేసుకోవాలో ఇంత వరకు ఎలాంటి పూర్తిస్థాయి వివరణ అందుబాటు లో ఉంచలేదని,అదేవిధంగా మే 30 వరకు కూడా వెబ్సైట్లో చాలా మార్పులు చేశారని, ఇంకా పూర్తి స్థాయి మార్పులు కూడా చేయాల్సిన అవసరం ఉందని అధికారులు తెలియజేస్తున్న తరుణంలో చడి చప్పుడు లేకుండా జీతంలో కోత విధించడం అన్యాయమని వారు అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఉపాధ్యాయ సంఘాల ద్వారా అభిప్రాయాలను సేకరించి, ఆరోగ్య కార్డుల జారీలో మార్గదర్శకాలు తయారు చేసి,విడుదల చేయాలని,ప్రత్యేకంగా ఎవరైతే ఈ పథకంలో చేరడానికి ఆసక్తి చూపుతారో వారికే కోత విధించాలని,ఇష్టం లేని వారికి కోత విధించకుండా నిబంధనలు తయారు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం తనకు తానుగా ప్రభుత్వ ఉద్యోగుల ఆరోగ్యానికి సంబంధించి రక్షణ తీసుకోవాల్సిన బాధ్యత నుంచి తప్పించుకునే క్రమంలో ఒక కొత్త విధానానికి శ్రీకారం చుడుతూ,ఉద్యోగుల నుంచి ప్రీమియం చెల్లింపును కోరింది. దీనిని కొన్ని సంఘాలు వ్యతిరేకించాయి. అయినా ప్రభుత్వం ఆరోగ్య కార్డులు జారీకి సిద్ధమైంది.

కానీ అందరూ ఉద్యోగులకు ఆరోగ్య కార్డుల కొరకు కోత విధించడం అన్యాయమని, ఉద్యోగుల దగ్గర ఆప్షన్ తీసుకొని మాత్రమే కోతలు విధించాలని డిమాండ్ చేశారు. అంతేకాకుండా ఇప్పుడునెల జీతంలో ముందస్తుగానే కోత విధించారనీ,ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకొని విధించిన కోతను మళ్ళీ మే నెల జీతంలో కలిపి చెల్లించాలని వారు డిమాండ్ చేశారు. లేనిచో పెద్ద ఎత్తున ఉద్యమం చేయడానికి సిద్ధమవుతున్నామని వారు తెలిపారు.

# ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవ ర్యాలీ, ప్రతిజ్ఞ

**టేకులపల్లి, మే 31(జనంసాక్షి):**
ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ప్రజలు పొగాకు ఉత్పత్తుల వినియోగాన్ని పూర్తిగా మానుకోవాలని స్థానిక వైద్యాధికారి డాక్టర్ కంచర్ల వెంకటేష్ పిలుపునిచ్చారు. మే 31 ఆదివారం ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవ ర్యాలీ, అనంతరం ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ పొగాకు ఆరోగ్యానికి అత్యంత హానికరమైనవ్యసనా పదార్థమని దీనిలో నికోటిన్ అనే రసాయనిక పదార్థం వల్ల దీనికి వ్యసనపరులుగా మారుతారని సిగరెట్లు,బీడీలు,గుట్కా,పాన్ మసాలా వంటి పొగాకు ఉత్పత్తులు వాడటం వల్ల ప్రధానంగా నోటి క్యాన్సర్,నాలుక క్యాన్సర్, గొంతు క్యాన్సర్,ఊపిరి తిత్తుల క్యాన్సర్,ఆహారనాళం క్యాన్సర్, పొట్ట క్యాన్సర్,మూత్రశయ క్యాన్సర్,గుండె జబ్బులు, ఊపిరితిత్తుల వ్యాధులు, స్ట్రోక్ వంటి తీవ్రమైన అనారోగ్య సమస్యలకు ప్రధాన కారణమవుతున్నా యని పొగాకులు దగ్గర దగ్గరగా 7000 రకాల రసాయనాలు ఉంటాయని, వాటిలో 70 రకాల రసాయనాలు క్యాన్సర్ కారకాలుగా పనిచేస్తాయని తెలిపారు. ముఖ్యంగా యువత పొగాకు అలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు. పొగాకు వినియోగం వల్ల ఆరోగ్య నష్టం మాత్రమే కాకుండా కుటుంబ ఆర్థిక పరిస్థితిపై కూడా తీవ్ర ప్రభావం పడుతుందని పేర్కొన్నారు. ప్రజలు ఆరోగ్య కరమైన జీవనశైలిని అలవాటు చేసుకొని పొగాకు పదార్థాలకు పూర్తిగా దూరంగా ఉండాలని కోరారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పొగాకు నియంత్రణ చట్టాలను ప్రతి ఒక్కరూ పాటించాలని, ప్రజా ప్రదేశాల్లో ధూమపానం చేయరాదని ముఖ్యంగా విద్యార్థులకు పొగాకు వాడకం వల్ల వచ్చే తీవ్రమైన అనర్థాలపై చక్కటి అవగాహన నిరంతరం కల్పించాలని ఆదేశిస్తూ, అనంతరం ప్రతిజ్ఞ చేశారు. ఈ అవగాహన ర్యాలీ, సమావేశ కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ వజ్జా పార్వతి,పబ్లిక్ హెల్త్ నర్స్ ఆఫీసర్ చంద్రకళ,సూపర్వైజర్లు గుజ్జ విజయ, కౌసల్య సింగ్, మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్లు రుక్సానా చందన, ఇంద్రజ,హారిక,ధరణి,అమూల్య, ఏఎన్ఎంలు,ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# మడుపల్లి చెరువులను కాపాడండి

- ప్రజల అవగాహనతో పాటు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తక్షణ జోక్యం అవసరం
- విలేకరుల సమావేశంలో బిఆర్ఎస్ నాయకులు



**మధిర, మే 31 (జనంసాక్షి):**
మధిర మున్సిపాలిటీ పరిధిలోని మడుపల్లి చెరువులో రైతాంగ అవసరాల పేరుతో జరుగుతున్న మట్టి తవ్వకాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మధిర నియోజక వర్గ బిఆర్ఎస్ నాయకులు పిలుపునిచ్చారు. చెరువుల సహజ వనరులు కొందరి లాభాల కోసం దోపిడీకి గురి కాకుండా కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరి పై ఉందన్నారు. చెరువు మట్టిని రైతులకు అవసరమని చెప్పి, కొంతమంది దళారులు రియల్ ఎస్టేట్ వ్యాపారులు, షాపింగ్ కాంప్లె క్సులు, పెట్రోల్ బంకులు ఆంధ్రప్రదేశ్ ప్రాంతాలకు అక్రమంగా తరలిస్తూ కోట్ల రూపాయల వ్యాపారం చేస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికే చెరువులో ఉన్న నీటిని మోటార్లతో తొలగిస్తూ మట్టి తవ్వకాలు చేపడుతున్నారని, దీనివల్ల భవిష్యత్తులో రైతులు, పశువులు తీవ్రమైన నీటి ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. అలాగే రిటైనింగ్ వాల్ వద్ద ఉన్న మట్టిని కూడా అక్రమంగా తరలిస్తున్నారని ఆరోపించారు. టెండర్లో శ్మశాన వాటికలు, మహాప్రస్థానం అభివృద్ధి పనుల కోసం గ్రావెల్ మట్టిని ఉపయోగిస్తామని చెప్పి, ప్రస్తుతం మాత్రం చెరువు మట్టి రిటైనింగ్ వాల్ వద్ద ఉన్న మట్టినే వినియోగిస్తున్నారని తెలిపారు. దీనివల్ల ఆ ప్రాంతంలోని భూమి బలహీనపడి సమీప భవనాలు, గోడలు మరియు నిర్మాణాలకు పగుళ్లు వచ్చే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజల ఆస్తిగా ఉన్న చెరువులను రక్షించాల్సిన అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారా? లేక ఈ అక్రమాలకు మద్దతు ఇస్తున్నారా? అనే అనుమానాలు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయని తెలిపారు. మధిరలో జరుగుతున్న అభివృద్ధి పనులన్నీ కొంతమంది చేతుల్లోనే కేంద్రీకృతమవుతున్నాయని, ఇతర కాంట్రాక్టర్లను బెదిరించి టెండర్ల నుంచి తప్పుకునేలా చేస్తున్నారనే ఆరోపణలు కూడా చేశారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క వెంటనే స్పందించి మడుపల్లి చెరువులో జరుగుతున్న మట్టి తవ్వకాలు, అక్రమ రవాణా, రిటైనింగ్ వాల్ ప్రాంతంలో మట్టి తరలింపుపై పూర్తి స్థాయి విచారణ జరిపించాలని మధిర నియోజకవర్గ ఃఖీ నాయకులు డిమాండ్ చేశారు. చెరువుల సహజ స్వరూపాన్ని కాపాడుతూ అక్రమ మట్టి తరలింపును అడ్డుకొని బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. మధిర పార్టీ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో మధిర టౌన్ అధ్యక్షుడు పల్లపోతుల వెంకటేశ్వరరావు (కనుమూరి), కార్యదర్శి అరిగె శ్రీనివాసరావు, ప్రాథమిక సహకార సంఘం చైర్మన్ బిక్కి ప్రసాద్, మడుపల్లి ఃఖీ నాయకుడు ఐలూరి ఉమామహేశ్వర రెడ్డి, ఃఖీ కౌన్సిలర్ వై. అప్పారావు, మధిర మండల ఃఖీ అధ్యక్షుడు రావూరి శ్రీను, కార్యదర్శి బొగ్గుల భాస్కర్ రెడ్డి, మాజీ మధిర అగ్రికల్చరల్ మార్కెట్ చైర్మన్ చిత్తార్ నాగేశ్వరరావు, దేశినేని పాలెం మాజీ ఆత్మ కమిటీ చైర్మన్ రంగిశెట్టి కోటేశ్వరరావు, జిలుగుమాడు ఃఖీ నాయకులు కొంతారి రాఘవరావు, లంకమల్ల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ ఏర్పడినా.., సాకారం కాని కలలు..

## మరో పోరాటానికి సమాయత్తం అవుతున్న ఉద్యమకారులు : బత్తుల సోమయ్య

**ఖమ్మం కార్పొరేషన్, మే 31 (జనంసాక్షి)** దశాబ్దాల పాటు జరిగిన పోరాటాలు, ఉద్యమాలు కేవలం భౌతిక తెలంగాణ కోసం కాదని .., సామాజిక తెలంగాణ కోసమే అని సుదీర్ఘ పోరాటాలు సాగాయని..,, ప్రస్తుతం ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడినా.. తెలంగాణ ప్రజల కలలు ఏమాత్ర సాకారం చెందలేదు..ఈ సమయంలో మరో పోరాటానికి తెలంగాణ ఉద్యమకారులు సమాయత్తం అవుతున్నారు. 1956 నాటి సమయంలో భాష ప్రాతిపాదికన పై ఆంధ్రా ప్రాంతంలో తెలంగాణ ను విలీనం చేయడం ద్వారా ఆంధ్రప్రదేశ్ అవతరించిందని, ఈ ఆంధ్రప్రదేశ్ ఏర్పాటుకు ముందు ఫజల్ అలీ కమిషన్ చెప్పినా వినకుండా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి పచ్చజెండా ఊపారు. దక్కన్ ప్రాంతంలో హైదరాబాద్ సంస్థానం తన ప్రత్యేక భాష, సంస్కృతి, సాంప్రదాయం, అస్తిత్వం అంశంలో ఒక ప్రత్యేకత కలిగి ఉన్న ఆంధ్ర విలీనంతో వీటి ఉనికికి బీటలు వారడం ప్రారంభమైంది. తెలంగాణ ప్రజలు వీరోచిత పోరాటానికి ప్రసిద్ధులు. తెలంగాణలో నిజాం కాలంలో జరిగిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం ఇందుకు మంచి ఉదాహరణ ఆంధ్ర-తెలంగాణ విలీనంతో ఏర్పడిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పెద్ద మనుషుల ఒప్పందం అమలు కాకుండా కొందరి కుట్రలు కారణంగా, మరికొందరు వివక్షతల ప్రవర్తన మూలంగా తెలంగాణ పోరాటం ఉద్యమం ఆవిర్భవించింది. అనేక దశాబ్దాల పాటు సాగిన ఈ పోరాటం, ఉద్యమం సందర్భంగా అంతర్ లీనంగా... మన ఉద్యోగాలు, మన నిధులు, మన నియామకాలు, మన నీళ్ళు, ప్రధాన అంశాలుగా తెరపైకి వచ్చాయి. ఆంధ్రా లాబీ ఈ పోరాటాలను, ఉద్యమాలను తీవ్రంగా అణచివేస్తూ వచ్చాయి. స్వరాష్ట్రం కోసం 1200 మంది బలిదానాలు చేసుకుంటే చూడలేక...ఎట్టకేలకు సోనియా గాంధీ మూలంగా ఆ నాటి యూపీఏ ప్రభుత్వం 2014 జూన్ 2వ



తేదీన తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటుకు మొగ్గు చూపింది. అప్పటికి కూడా ఆంధ్రా లాబీ తెలంగాణ రాష్ట్రం ఏర్పడకుండా శత విధాలుగా ప్రయత్నాలు సాగించింది. పార్లమెంట్ లో కూడా అడ్డుకోవడానికి తెగించింది. ఆకరికి ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడింది. తొలి రెండు దఫాలు టీఆర్ఎస్ (బీఆర్ఎస్)తెలంగాణ ప్రభుత్వ పాలక పార్టీగా వ్యవహరించింది. నిన్నటి ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ తెలంగాణ లో ప్రభుత్వాన్ని ఏర్పరచింది. సుమారు 13 సంవత్సరాలు కావస్తోంది.. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఆవిర్భవించి తెలంగాణ ప్రజల ఆకాంక్షలు , వారి కలలు, తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించినప్పటికీ నెరవేరక పోవడం విచారకరం. తెలంగాణ పోరాటాన్ని, ఉద్యమాన్ని పరిహసించడమే కాకుండా వ్యతిరేకించడంతో పాటు దాడులు చేసినవారు, దాడులు చేయించిన వారు ఆ నాటి తెలంగాణ ద్రోహులు గత ప్రభుత్వంలోను, నేటి ప్రభుత్వంలో మంత్రులుగా కీలకమైన ఇతర పదవులలో కొనసాగుతుండడం మన దౌర్భాగ్యం. తెలంగాణ ఏర్పాటులో ప్రజలకు కదిలించడంలో వారిని అవగాహన పేర్చడంలో నిత్యం పోరాట యోధులుగా వ్యవహరించిన కీలక పాత్రధారులు మన తెలంగాణ ఉద్యమకారులు. ఈ ఉద్యమకారుల అంశంలో తొలి అధికారపార్టీ, ప్రస్తుత అధికార పార్టీలు ఇచ్చిన హామీల విషయంలో చిత్తశుద్ధి గాని, ఏ విధమైన హామీ ఇచ్చామని ఇంగితం కూడా లేకుండా వ్యవహరించడం అత్యంత గర్హనీయ విషయం. తొలిసారి 1969వ దశకంలో ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం కోసం ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఆమరణ నిరాహార దీక్షలు ప్రారంభం కావడం.., ఇక్కడే తొలి ప్రాణత్యాగం కూడా జరగడం.. ఆ నాటి పోరాటం ఉద్యమం సందర్భంగా 300పై చిలుకు ప్రాణాలు కోల్పోవడం మలి దశ పోరాటంలో కూడా ఇదే విధంగా కొందరు తెలంగాణ కోసం అమరులు అవ్వడం జరిగాయి. ఇలాంటి త్యాగాలు చేసిన.., లేదా అమరులైన వారి కుటుంబాలకు తొలిదశ ఉద్యమంలో మిగిలి ఉన్న కొందరికి మలి దశ సందర్భంగా ఇంకా ఆశలు పెట్టుకుని బ్రతుకులు ఈడుస్తున్న ఉద్యమకారులకు తెలంగాణ ఫలాలు దక్కక పోవడం.. ఇదే తెలంగాణాను అణచడానికి.., ఏ నాడు జై తెలంగాణ అని కూడా అనని వారికి ఈ రెండు పార్టీలు అందలం ఎక్కించడం.. నేపథ్యంలో తెలంగాణ ఉద్యమకారులు మరో పోరాటానికి, ఉద్యమానికి సమాయత్తం కావల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఆ నాడు టీఆర్ఎస్ గెలుపులో.., ప్రస్తుత కాంగ్రెస్ గెలుపులో ప్రధాన పాత్రధారులు తెలంగాణ ఉద్యమకారులు. వీరి విషయంలో ఆ నాటి ప్రభుత్వం, ఈ నాటి ప్రభుత్వం కూడా నిర్లక్ష్య దోరణి వహించడం.. , తల్లిపాలు తాగిన రొమ్మునే గుద్దడం వంటిది. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం సాధనే లక్ష్యంగా సాగిన పోరాటాలు , ఉద్యమాలు, త్యాగాలు, ఆత్మ బలిదానాల స్ఫూర్తితో మన తెలంగాణ ఉద్యమకారులు మరో పోరాటానికి సిద్ధం కాకుంటే మన హక్కులు నెరవేర్చబడవు. కాబట్టి మరోసారి జరిగే పోరాటం, ఉద్యమంలో తెలంగాణ ఉద్యమకారులకు అన్ని వర్గాల ప్రజలు సంఘీభావం తెలపాలి. అప్పుడే సామాన్య ప్రజల కలలు సాకారం చెందుతాయి. సామాజిక తెలంగాణ , బంగారు తెలంగాణ ఏర్పడుతుంది. బడుగు బలహీన వర్గాలకు రాజకీయ, సామాజిక సాధికారత లభ్యమవుతుంది.

## ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను

# జూన్ 2 నుండి అమలుచేయాలి

### పి వై ఎల్ రాష్ట్ర సహాయ కార్యదర్శి, తెలంగాణ రాష్ట్ర మలిదశ ఉద్యమకారుడు నోముల భానుచందర్



**టేకులపల్లి, మే 31(జనంసాక్షి):** అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ తెలంగాణ రాష్ట్ర ఉద్యమకారులకు ఇచ్చినటువంటి హామీలను తక్షణమే అమలు చేయాలని, తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా జూన్ 2 నుండి తక్షణమే అమలు చేయాలని తెలంగాణ రాష్ట్ర మలిదశ ఉద్యమకారుడు, పి వై ఎల్ రాష్ట్ర సహాయ కార్యదర్శి నోముల భానుచందర్ డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండున్నర సంవత్సరాలు గడుస్తున్నా నేటికీ తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చినటువంటి హామీని అమలు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీని అమలు చేయాలని తెలంగాణ ఉద్యమకారులు హైకోర్టులో ప్రభుత్వం పై కేసు వేసిన సందర్భంగా తక్షణమే ఉద్యమకారులకు ఇచ్చినటువంటి హామీలను అమలు చేయాలని హైకోర్టు తీర్పునివ్వడం జరిగిందన్నారు.

దీనికి సంబంధించి 8(ఎనిమిది) వారాల గడువు కూడా రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఇవ్వడం జరిగింది. హైకోర్టు తీర్పులో ఉద్యమకారులకు ఇళ్ల స్థలాలు (ప్లాట్ ), పెన్షన్ తదితర ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని ఆదేశించారు. హైకోర్టు తీర్పును గౌరవిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జూన్ 2 తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా నిజమైన ఉద్యమ కారులను గుర్తించి వారికి ఇచ్చిన హామీల ను అమలు చేయాలని, కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# తెలంగాణ ఆక్రమణకు మళ్ళీ జరుగుతున్న కుట్రలను తిప్పి కొడదాం

### టీపీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మెంతెన సంజీవరావు

**టేకులపల్లి, మే 31(జనంసాక్షి):** తెలంగాణ ఆక్రమణకు మళ్ళీ కుట్ర జరుగుతుందని, ఆ కుట్రలను తిప్పి కొట్టడానికి తెలంగాణ ప్రతి పౌరుడు నడుం బిగించాల్సిన సమయం ఆసన్నమైందని టీపీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మెంతెన సంజీవరావు అన్నారు. తెలంగాణ అమరవీరుల వారోత్సవాలల్లో భాగంగా ఆదివారం "తెలంగాణ ప్రజాఫ్రంట్ ఉమ్మడి ఖమ్మం జిల్లా కమిటీ" ఆధ్వర్యంలో టేకులపల్లిలోని కొమరం భీమ్ విగ్రహ కూడలి (బోడు సెంటర్ )వద్ద జిల్లా అధ్యక్షులు రామటెంకి అశోక్ అధ్యక్షతన కరపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూతెలంగాణ రాష్ట్రంలో మరలా ఆంధ్రా కేంద్రీత రాజకీయ శక్తుల ప్రయోగశాలగా మార్చడానికి కేంద్ర ,రాష్ట్ర పాలకులు ఉమ్మడిగా పథకం ప్రకారం కుట్రలు పన్ను తున్నారని- ఒక పథకం ప్రకారంగాతెలంగాణ సాంస్కృతిక, రాజకీయ పునరాక్రమనకు తెర తీసినట్లుగా స్పష్టమవుతుందని ఆయన స్పష్టం చేశారు.తెలంగాణలోని ప్రజాస్వామిక ఆకాంక్ష పరులు పోరాటంలో, విద్యార్థులు,యువజనులు, అశేష ప్రజలు ఎంతోమంది పోరాడుతూ



రక్తం చిందించి, బలిదానాలు చేసుకొని నిర్మించుకున్న, సాధించు కున్న తెలంగాణలో తెలంగాణవిభజనను -భావజాలాన్ని, తెలంగాణ అస్తిత్వాన్ని, అంత మొందించే నిశ్శబ్ద కుట్రను తెలంగాణ ప్రజలు విజ్ఞతగా పరిశీలిస్తూ ప్రజలను ప్రజా స్వామిక తెలంగాణ సాధన వైపు సిద్ధం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చేస్తున్న దోపిడీ అణచివేత విధానాలకు వ్యతిరేకం గా పోరాడాలని పిలుపునిచ్చారు. తెలంగాణ రాష్ట్ర విభజనపై,అస్తిత్వం పై జరుగుతున్న దాడులను ఖండించాలని,మేధావులు బుద్ధిజీవులు, ప్రజాస్వా మిక తెలంగాణ వాదులపై జరుగుతున్న (ఊపా) ఎన్ ఐ ఏ దాడులు ఆపాలని పేర్కొన్నారు. అంతిమంగా తెలంగాణలోని మూడున్నర కోట్ల ప్రజలుప్రజాస్వామిక తెలంగాణకై తెగించి కొట్లాడాలని ఆయన పిలుపునిచ్చారు.ఈ క్రమంలోనే తెలంగాణ ప్రజాఫ్రంట్ రాష్ట్రస్థాయిలో తెలంగాణ అమరుల స్మారకార్థం నిర్వహించ తలపెట్టిన జూన్ 2 తెలంగాణ ఆవిర్భావం నాటి సదస్సును ప్రజలు, ప్రజాస్వామిక వాదులు, మేధావులు పాల్గొని జయప్రదం చేయాల్సిందిగా కోరారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ ప్రజాఫ్రంట్ ఉమ్మడి ఖమ్మం జిల్లా అధ్యక్షులు రామటెంకి అశోక్, తుడుందెబ్బ జిల్లా అధ్యక్షులు దుగ్గారపు వీరభద్రం, జిల్లా నాయకులు కొప్పుల గీతారెడ్డి, బానోత్ లక్పతి,వట్టం నాగేందర్, ఆరెం వీరయ్య, మాలోతు వసంతరావు, ఐ లక్ష్మణ్, గుగులోతు వస్రాం, ఆరెం నాగరాజు, జహంగీర్ ఖాన్, పి బాలకృష్ణ, అలేం కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## లయన్స్ క్లబ్ ఆఫ్ టేకులపల్లి సౌజన్యంతో

# విద్యార్థినులకు సైకిళ్ల పంపిణీ



**టేకులపల్లి, మే 31(జనంసాక్షి):** లయన్స్ క్లబ్ ఆఫ్ టేకులపల్లి సౌజన్యంతో విద్యార్థినులకు సైకిళ్ల పంపిణీ కార్యక్రమం లయన్స్ క్లబ్ ఆఫ్ ఇంటర్నేషనల్ వారి ఆర్థిక సహకారంతో, లయన్స్ క్లబ్ ఆఫ్ టేకులపల్లి ఆధ్వర్యంలో విద్యాభివృద్ధి, బాలికల ప్రోత్సాహం లక్ష్యంగా పలు పాఠశాలల విద్యా ర్థినులకు సైకిళ్ల పంపిణీ కార్యక్రమం ఆదివారం ఘనంగా టేకులపల్లిలో నిర్వహించారు. ఈ కార్యక్ర మానికి ముఖ్య అతిథిగా ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య హాజరై వారి చేతులు మీదుగా విద్యార్థి నులకు సైకిళ్లను అందజేసి, వారి విద్యా భ్యాసంలో మరింత పురోగతి సాధించాలని ఆకాంక్షించారు. గ్రామీణ ప్రాంతాల విద్యా ర్థినులు పాఠశాలకు సులభంగా చేరుకోవడా నికి ఇటువంటి సేవా కార్యక్రమాలు ఎంతో ఉపయోగకరమని ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఆత్మ కమిటీ చైర్మన్ బోడ మంగిలాల్ , పలువురు రాజకీయ పార్టీ నాయకులు ఈది గణేష్, ఇస్లావత్ రెడ్డి నాయక్, మూడు సంజయ్,నర్సింగ్ లక్ష్మ య్య తదితరులు పాల్గొని విద్యార్థినులను అభినందించారు. లయన్స్ క్లబ్ ఆఫ్ టేకులపల్లి అధ్యక్షులు కేశ వేణుగోపాల రావు మాట్లాడుతూ సమాజ సేవే లయన్స్ క్లబ్ ప్రధాన లక్ష్యమని, విద్య, ఆరోగ్యం, సామాజిక, సంక్షేమ రంగాల్లో క్లబ్ నిరంతరం సేవా కార్యక్రమాలు నిర్వహిస్తుందని తెలిపారు.క్లబ్ కార్యదర్శి తోటకూరి సందీప్ కుమార్ కార్యక్రమ నిర్వహణలో కీలక పాత్ర పోషించి, లయన్స్ క్లబ్ చేపడుతున్న సేవా కార్యక్ర మాల వివరాలను తెలియజేశారు. ట్రెజరర్ దుర్గారావు,వీరభద్రం,అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ బొడ్డుపల్లి బ్రహ్మచారి కార్యక్రమం విజయవంతానికి విశేషంగా కృషి చేశారు. క్లబ్ సభ్యులు బండ్ల శ్రీనివాస్, బండ్ల రజిని,అంబాల బాలయ్య, అంబాల మయూరి, ఆర్ ఎం నరసింహారావు, ఉపేందర్ రావు ప్రజాప్రతినిధులు, నాయకులు, లయన్స్ క్లబ్ సభ్యులు, విద్యార్థినులు,తల్లిదండ్రులు,గ్రామ ప్రజలు పాల్గొన్నారు.